క్లుప్తంగా

వేతనాలు ఇప్పించండి..

● పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మూడు నెలల నుంచి వేతనాలు లేక అల్లాడుతున్నారు. బతుకమ్మ, దసరా పండుగకు బట్టలు కొనుక్కోవాలి సారు.. మా పిల్లలు ఎదురు చూస్తున్నారని పారిశుద్ధ్య కార్మికులు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికార పార్టీ పాలకులు ఉన్నప్పటికీ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను పట్టించుకోవడం లేదు పండుగ వస్తుందని జీతాలు ఇప్పించాలని ఈనెల 15న స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. పాలకులు, జిల్లా ఉన్నతాధికారులు సైతం పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు ఇవ్వకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఉత్పత్తిదారులు తగ్గిస్తేనే మేలు

ములుగు రూరల్: జీఎస్టీ తగ్గుదల చేస్తే ప్రజలకు ప్రయోజనం లేదని ఉత్పత్తిదారులు తయారీ చేసే వస్తువుల రేటు తగ్గిస్తేనే వినియోగదారులకు మేలు కలుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనుకుంటే ఉత్పత్తిదారులు లాభాలను కట్టడి చేసి ఉత్పత్తి ధరలను తగ్గించాలని అన్నారు.

నలుగురికి గాయాలు



వెంకటాపురం(కె): మండలంలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మంగళవారం నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే మండలంలోని అంకన్నగూడెం గ్రామం వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల రామకృష్ణగౌడ్ దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వారిని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పరామర్శించారు. అలాగే మాజీ సర్పంచ్ నేరేళ్ల చేరాలు ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందగా ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన చిలువేరు సారయ్య, గణేష్‌పల్లి గ్రామానికి చెందిన నాగలని కమలమ్మ, మేదరమేట్ల గ్రామానికి చెందిన ఐలమ్మ , ఆకినపల్లి గ్రామానికి చెందిన దూడపాక ఓదేలు ఇటీవల పలు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ ఫోరం మాజీ మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, మాజీ సర్పంచ్ దానవేణి రాములు, ఉప సర్పంచ్ దార్ల ఆనంద్, రమేశ్, దేవుని కుమార్, తదితరులు ఉన్నారు.

పుష్కర ఘాట్ నిర్మించేనా?

● ఘాట్ నిర్మాణానికి మండలంలో అనువైన ప్రదేశాలు
● గతంలో పూసూరు వద్దనే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు



2015 సంవత్సరం గోదావరి పుష్కరాల్లో పూసూరు వద్ద పుణ్యస్నానాల కోసం వచ్చిన భక్తులు

వాజేడు: ప్రతీ పన్నెండు సంవత్సరాలకు వచ్చే గోదావరి పుష్కరాల్లో ప్రజలు పుణ్యస్నానాలను చేయడానికి మండలంలో ఒక్క పుష్కర ఘాట్ కూడా లేదు. మరో రెండు సంవత్సరాల్లో 2027లో గోదావరి పుష్కరాలు వస్తున్న తరుణంలో మండలానికి పుష్కర ఘాట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. 2015 సంవత్సరంలో గోదావరి పుష్కరాలు నిర్వహించిన సమయంలో అధికారులు అట్టహాసంగా వాజేడు, పూసూరు, పేరూరు వద్ద పుష్కర ఘాట్ కోసం అనువైన ప్రదేశాన్ని గోదావరి ఒడ్డున పరిశీలించారు. మండలానికి పుష్కర ఘాట్ వస్తుందని భావిస్తున్న క్రమంలో మొండి చేయి చూపించి ఏటూరునాగారం మండలంలో రెండు పుష్కర ఘాట్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో వాజేడు మండలానికి పుష్కర ఘాట్ రాలేదు.

మండలాన్ని విస్మరించిన ప్రభుత్వం

మండల పరిధిలోని టేకులగూడెం గ్రామం నుంచి ఏడ్జెర్లపల్లి గ్రామం వరకు గోదావరి ఒడ్డు వెంట ప్రవహిస్తోంది. దీంతో పుష్కరాల సమయంలో పుణ్య స్నానాలను చేయడానికి అన్ని చోట్ల అనువైన ప్రదేశం ఉంది. కానీ వెంకటాపురం(కె) మండలంలో పాటు ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో పుష్కరఘాట్లను మంజూరు చేసిన అప్పటి ప్రభుత్వం వాజేడు మండలాన్ని విస్మరించింది. అప్పుడు ఉన్న రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే మండలానికి మంజూరు చేయాల్సిన పుష్కర ఘాట్‌ను మరో మండలానికి మంజూరు చేశారని విమర్శలు వచ్చాయి.

అవతల పుష్కర ఘాట్.. ఇవతల పుణ్య స్నానాలు

మండల కేంద్రంతో పాటు, పూసూరు వద్ద గోదావరి గ్రామాలకు దగ్గరగా ఉంటుంది. కానీ అధికారులు ముల్లెకట్ట వైపున పుష్కర ఘాట్‌ను నిర్మించారు. ఇక్కడ అన్ని ఏర్పాట్లను చేపట్టినప్పటికీ పుష్కర ఘాట్‌కు గోదావరికి మధ్యన సుమారుగా 2 కిలో మీటర్ల దూరం ఉంటుంది. దీంతో ఇక్కడ భక్తులు ఏ ఒక్కరు కూడా పుణ్య స్నానాలను చేయలేదు. ఇక్కడ ఆలయం కూడా లేక పోవడంతో అత్యవసరంగా ఒక ఆలయం నిర్మించినా అక్కడికి భక్తులు ఎవరు వెళ్లలేదు. ఈ ఘాట్‌కు వచ్చిన వారు కూడా అప్పుడే కొత్తగా గోదావరిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం చివరి దశలో ఉండడంతో 2015 సంవత్సరంలో ప్రతీ రోజు వేల సంఖ్యలో పూసూరు వైపునకు నడిచి వచ్చి పుణ్య స్నానాలను చేశారు. వాజేడు మండలంలోని పూసూరులో ఆంజనేయ స్వామి, వాజేడులో రామాలయం, శివాలయం, పేరూరులో రామాలయం ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఇక్కడి ప్రజల కోరిక మేరకు మండలానికి గోదావరి పుష్కరాల సమయంలోగా ఘాట్‌ను మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం పర్యటన విజయవంతం



మేడారంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

● సభ ప్రాంగణంలో మహిళల సందడి, కిక్కిరిసిన వేదిక
● భద్రతా వలయంలో మేడారం

గోవిందరావుపేట: ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతమైంది. మేడారం అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన సీఎం అనంతరం సభలో మాట్లాడారు. సభ ప్రాంగణం ప్రజలతో కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మేడారం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర జ్ఞాపకాలను గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పాదయాత్ర మేడారం నుంచే ప్రారంభమైందని గుర్తు చేసుకుంటూ సమ్మక్క సారలమ్మ తల్లులు తనకు దారి చూపించి ప్రజలకు దగ్గర చేశారని భావోద్వేగంతో మాట్లాడారు.

భద్రతా వలయంలో అడవి ప్రాంతం

సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా మేడారం అడవిప్రాంతం మొత్తం భద్రతా వలయంతో నిండిపోయింది. రహదారులు, ప్రధాన మార్గాలు, గ్రామాల వద్ద పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సభా ప్రాంగణం చుట్టూ కవాతు చేస్తూ భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారు. సీఎం పర్యటన ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా సాగేందుకు భారీగా పోలీసులు మోహరించారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

వెంకటాపురం(కె): చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ చుంచా రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని కొమురం భీమ్ విగ్రహం వద్ద ఈ నెల 28న భద్రాచలంలో నిర్వహించ తలపెట్టిన ధర్మయుద్ధం బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీల వల్ల ఆదివాసీలు ఉద్యోగ, ఉపాధి, విద్యా అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. తాజాగా ఆదివాసీల ఇలవేల్పులైన సమ్మక్క- సారలమ్మ, పాల్వంచ పెద్దమ్మ తల్లి, కట్టమైసమ్మ దేవతలను సైతం మా ఇలవేల్పులంటూ లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. దీంతో తొమ్మిది తెగలకు చెందిన ఆదివాసీల మనోభావాలు దెబ్బతింటున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఆదివాసీలంతా సంఘాలను పక్కకు పెట్టి పోరాడాలన్నారు. ఆదివాసీలు బహిరంగ సభకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కె.నర్సింహమూర్తి, వాసం నాగరాజు, శేషగిరి, లక్ష్మయ్య, పసుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వంగడాలతోనే అధిక దిగుబడి



వరిని పరిశీలిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: నాణ్యమైన వంగడాలతోనే అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేశ్ అన్నారు. మండల వ్యవసాయ అధికారులు, యునివర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం మండలంలోని పంటలను పరిశీలించారు. మండలంలో వేసిన నూతన వంగడమైన డబ్ల్యూజీఎస్ 962 వరి పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గోన్య నాయక్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకుతో ఆరోగ్యం



మెహందీ కార్యక్రమంలో విద్యార్థులు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కాలేజీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో నాల్గో రోజు విద్యార్థినులకు మెహందీ కార్యక్రమం నిర్వహించారు. మెహందీ ద్వారా కలిగే ప్రయోజ నాలను వివరించారు. సంప్రదాయ పద్ధతిలో ఉపయోగించే గోరింటాకుతో అనేక ఆరోగ్య ప్రయోజ నాలు ఉంటాయని అన్నారు. కరస్పాండెంట్ పిచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్, డైరెక్టర్ వెంకటరెడ్డి, అధ్యాపకులు రమ్య, కుమార్, నరేష్ తదితరులు ఉన్నారు.

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను వైద్యాధికారులు జ్యోతి, యోషిత నిర్వహించారు. ఈ సందర్భంగా 291 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు ఆశీష్, భాస్కర్, సిబ్బంది కోటి రెడ్డి ఉన్నారు.

రైతు సేవాకేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

కాళేశ్వరం: మహదేవపూర్‌లోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం-2ను ఏడీఏ శ్రీపాల్, ఏఓ సుప్రజ్యోతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఎలాంటి బిల్లులు లేకుండా ఆరు యూరియా బస్తాలు అక్రమంగా విక్రయాలు జరిపిన నేపథ్యంలో సంబంధిత నిర్వాహకుడికి సంజాయిషి ఇవ్వాలని షోకాజ్ నోటీస్ అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన 80 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షల 70 వేలు విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు. అనంతరం టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన సాద ఓదేలు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను స్థానిక సివిల్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి-సత్యం, చిట్యాల, టేకుమట్ల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, కోటగిరి సతీష్ గౌడ్, తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు చిలుకల రాయకొమురు, దొడ్డి కిష్టయ్య, గుర్రం తిరుపతిగౌడ్, కొమురయ్య, బుర్ర లక్ష్మన్, సర్వ శరత్, రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



చెక్కు అందజేస్తున్న గని మేనేజర్, కార్మికులు

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే 1వ గనిలో విధులు నిర్వర్తిస్తూ మృతిచెందిన గండే సిద్ధార్థ కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచారు. ఈ మేరకు గనిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, కార్మికులు రూ.2.23లక్షల విలువ గల చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి అందించి ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ మేరకు గని మేనేజర్ తిరుపతి, సంక్షేమాధికారి కిషోర్ చేతుల మీదగా సిద్ధార్థ భార్య జ్యోతికి అందించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: స్టార్‌యూత్ ఆధ్వర్యంలో గాయత్రీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో దేవిదుర్గానవరాత్రులలో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసినట్లు అర్చకుడు యల్లాప్రగఢ నాగేశ్వర్‌రావుశర్మ తెలిపారు. భవానీ మాలధారులు గాయత్రీ మంత్రాన్ని పఠించారు. సాయంత్రం లలితాదేవిసహస్రనామం, కుంకుమ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్టార్ యూత్ వద్ద అమ్మవారు గాయత్రీదేవిగా అలంకరించారు. క్రాస్‌రోడ్డు, సాయిబాబా దేవాలయం, ముత్యాలమ్మ గుడి, శివాలయం ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది.

శాకాంబరీదేవి అలంకరణలో అమ్మవారు

మంగపేట: మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖర స్వామి ఆలయంలో శ్రీ ఉమాదేవి అమ్మవారు భక్తులకు శాకాంబరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారని ఆలయ అర్చకుడు విస్సావజ్జుల నరేష్‌శర్మ శాఖాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో సాముహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. బోరునర్సాపురంలో దుర్గాదేవి అమ్మవారు రెండో రోజు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. నేడు(బుధవారం) బోరునర్సాపురంలో దుర్గాదేవి అమ్మవారివద్ద భక్తులకు మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వెండి పుష్పాల బహూకరణ



108 వెండి పుష్పాలను అందజేస్తున్న బ్రహ్మానందచారి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలోని అమ్మవారికి 108 వెండి పుష్పాలను మండల కేంద్రానికి చెందిన బాలోజు బ్రహ్మానందచారి ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్‌కు అందజేశారు. గతంలో అమ్మవారికి కర్రతో తయారు చేసిన ఉయ్యాలను బహూకరించారు. ఆలయ అభివృద్ధి, అమ్మవారి సేవకు అంకితమైనట్లు బ్రహ్మానందచారి తెలిపారు.



ఏటూరునాగారం: కుంకుమ పూజ చేస్తున్న భవానీ మాలధారులు



ఏటూరునాగారం: సాయిబాబా ఆలయంలో..



మంగపేట: శాకాంబరీదేవి అలంకరణలో అమ్మవారు



బోరునర్సాపురంలో గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

పోషకాహారం సమృద్ధిగా తీసుకోవాలి



కాటారం: సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు



టేకుమట్ల: అక్షరాభ్యాసం చేయిస్తున్న సిబ్బంది

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీణ

కాటారం: గర్భిణులు, బాలింతలు పోషకాహారం సమృద్ధిగా తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీణ అన్నారు. కాటారం మండల దామెరకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, ప్రీస్కూల్ విధానంపై తల్లులు, గర్భిణులు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోషకాలతో కూడిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, పాలు, గుడ్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించి గర్భిణులకు సీమంతం చేశారు. ఏఎస్ఎం విజయ, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, త్రివేణి, వసుమతి, కౌసల్య, ఆయాలు, ఆశాకార్యకర్తలు, తల్లులు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాలు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(టి)అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, వనితల ఆధ్వర్యంలో మంగళవారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎదిగే పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తప్పని సరిగా ఆకుకూరలను తీసుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించి, అక్షరాభ్యాసం చేయించారు. పంచాయతీ కార్యదర్శి కోమల, ఆశ కార్యకర్త సుజాత, ఆయాలు ఖతీజ, స్వప్న పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు పొందాలి

పలిమెల: ప్రతీ గర్భిణీ అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఐరన్, కాల్షియం టాబ్లెట్స్ తీసుకుంటూ ప్రతీ నెలా వైద్య పరీక్షలు చేయించుకుంటూ మెరుగైన వైద్య సేవలు పొందాలని సీడీపీఓ రాధికరెడ్డి సూచించారు. పోషణ మాసంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో సూపర్‌వైజర్ శివరాణి అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ రాధికరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల అభివృద్ధి ఏ వయస్సులో ఎలా ఉండాలనే దాని గురించి వివరించారు. కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పర్సంటేజ్ ఏ విధంగా ఉండాలని, వాళ్లు తీసుకునే ఆహారం గురించి, మోతాదు గురించి వివరించారు. ఆహారంలో ఎక్కువ శాతం చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి గర్భిణీలు, కిశోర బాలికలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మి, మల్లికార్జున్, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు



చిట్యాల: మండలంలోని చల్లగరిగ నుంచి ముచినిపర్తికి వెళ్లే ప్రధాన రోడ్డు బురదమయంగా మారింది. వర్షాలకు చల్లగరిగ గ్రామ పొలిమేర నుంచి వచ్చే వర్షపు నీరుతో పాటు గ్రామంలోని మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. దీంతో రెండు గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా తయారైంది. వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన రావడంతో రోడ్డుపై నడిచే వారు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించి మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.